ఏటూరునాగారం : ఉధృతంగా ప్రవహిస్తున్న జంపన్నవాగు

మంగపేట : ఉప్పొంగుతున్న గౌరారం వాగు

గోవిందరావుపేట : లక్నవరం కాటేజీలోకి చేరుకున్న వరద నీరు

వెంకటాపూర్ : జలకళతో రామప్ప చెరువు

వాజేడు : ఉధృతంగా జాలువారుతున్న బొగత జలపాతం

- ములుగు జిల్లాలో జోరుగా వర్షం
- పోటెత్తిన వరద, ఉప్పొంగుతున్న వాగులు, వంకలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం, కూలిన ఇండ్లు
- నీట మునిగిన పంటలు
- మత్తళ్లు పడుతున్న చెరువులు
- పర్యాటక ప్రదేశాల సందర్శన నిలిపివేత
- లక్నవరంలో కాటేజీల్లోకి చేరిన నీరు
- ఉప్పొంగుతున్న బొగత జలపాతం

ముంచెత్తిన వాన

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : ములుగు జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి నుంచి ఆదివారం వరకు కురిసిన వానకు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పంట పొలాలు నీటమునిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇండ్లలోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందిపడ్డారు. కల్వర్టులు, రహదారులపై నుంచి వరద పోటెత్తడంతో పలు ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ములుగు మండలంలో బొగ్గుల వాగు వరద నీరు ప్రవహించడంతో అంకన్నగూడెం, జగ్గన్నగూడెం, సర్వాపురం గ్రామాలకు హైలెవల్ మీదుగా రాకపోకలు కొనసాగాయి. అంకన్నగూడెంలోని బాలకుమారస్వామి ఆలయం వరకు నీరు చేరింది. ఆదివారం రాత్రి సైతం భారీ వర్షం కురిస్తే ఇండ్లలోకి వరద నీరు చేరింది. ఏటూరునాగారం, దొడ్ల, ఎలిశెట్టిపల్లి సమీపంలోని జంపన్నవాగుకు వరద పోటెత్తడంతో దొడ్ల సమీపంలో కూలిన బ్రిడ్జిని ఆనుకుని ప్రవహిస్తున్నది. ఎలిశెట్టిపల్లి సమీపంలో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ రెండు చోట్ల బోట్లు ఏర్పాటు చేసినప్పటికీ ఫలితంలేకుండాపోయింది. భూటారం, ఏటూరునాగారం, రొయ్యూరు, శంకరాజుపల్లి సమీపంలో వరి పంట మునిగింది. రొయ్యూరులోని మాటు కుంట చెరువు మత్తడి పడడంతో రోడ్డుపై నుంచి నీళ్లు ప్రవహిస్తున్నాయి. తహసీల్దార్ జగదీశ్వర్, సీఐ శ్రీనివాస్, ఆర్ఐ కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి సతీశ్ బోటులో వాగు దొడ్ల వాగు దాటి కాలినడకన కొండాయికి వెళ్లారు. గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించి వరద వస్తే వెంటనే గోవిందరాజుల కాలనీకి తరలి వెళ్లాలని ప్రజలకు సూచించారు. ఇక ఇక్కడ విపత్తు నివారణ వారికి చెందిన బోటుతో పాటు చేపలు పట్టుకునే పడవ ఏర్పాటు చేశామన్నారు. లైవ్ జాకెట్లు, టార్చి లైట్లు వారికి పంపిణీ చేశారు. మంగపేట శివారు గౌరారం, కమలాపురం ఎర్రవాగు, రాజుపేట ముసులమ్మ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కార్యదర్శులను అప్రమత్తం చేసినట్లు ఎంపీడీవో శ్రీకాంత్ నాయుడు తెలిపారు. శనగకుంట గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డుపైకి ఒర్రె నీరు, బొమ్మాయిగూడెం గ్రామానికి వెళ్లే రోడ్డుపైకి గౌరారం వాగు ప్రవాహం పెరిగే అవకాశాలున్న నేపథ్యంలో ఎవరూ ప్రవాహాన్ని దాటొద్దని హెచ్చరించారు. కొత్తూరు మొట్లగూడెం-బొమ్మాయిగూడెం గ్రామాల నడుమ ప్రవహిస్తున్న గౌరారం వాగుపై వంతెన లేక పోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తాడ్వాయి మండలంలో శనివారం రాత్రి గాలి వాన భీభత్సం సృష్టించింది. సుమారు 26.52 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మేడారంలో జంపన్నవాగు జంట వంతెనలను తాకుతూ ప్రమాదకరంగా ప్రవహిస్తున్నది. లవ్వాల స్టేజీ వద్ద 163వ జాతీయ రహదారిపై జనగలంచ వాగు ఉధృతికి రాకపోకలు నిలిచిపోయాయి. వంతెన దెబ్బతినడంతో భారీ వాహనాలను పోలీసులు మేడారం మీదుగా మళ్లించారు. వెంగ్లాపురం వద్ద గల బొంతల వాగులో ఇసుక లారీ చిక్కుకుపోయింది. మండలకేంద్రంలోని జాతీయ రహదారి వరదకు కోతకు గురైంది. తాడ్వాయి-మేడారం మధ్యలో గాలి భీభత్సానికి సుమారు రెండు కిలోమీటర్ల మేర అడవిలో చెట్లు నేలమట్టమయ్యాయి. మంత్రి సీతక్క ఎస్పీ శబరీష్‌తో కలిసి బొంతల వాగుతో పాటు జనగలంచ, కొండపర్తిలో కూలిన ఇండ్లను పరిశీలించారు. జాతీయ రహదారిని వెంటనే మరమ్మతులు చేసేలా చర్యలు చేపడుతామని తెలిపారు. అనంతరం మేడారం రోడ్డులో గాలికి ధ్వంసమైన అడవిని పరిశీలించారు.

తాడ్వాయి : జంట వంతెనలకు తాకుతూ ప్రవహిస్తున్న జంపన్నవాగు

విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో అధికారులు పరిశీలించి మరమ్మతులు చేపట్టారు. మేడారంలోని జంపన్నవాగును పరిశీలించి పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గోవిందరావుపేట మండలం లక్నవరం సరస్సులోకి ఎగువ ప్రాంతాల నుండి భారీగా వరద నీరు చేరడంతో సుమారు 8 అడుగుల ఎత్తుతో మత్తడి పోస్తూ దయ్యాలవాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. సరస్సులోని 2వ ఐలాండ్, గ్లాస్ కాటేజీల్లోకి, వేలాడే వంతెనపైకి వరద నీరు చేరింది. కుంటలు, చెరువులు పూర్తి స్థాయిలో నిండి గండ్లుపడే ప్రమాదం ఉంది. దయ్యాలవాగు సమీపంలోని కాలనీ వాసులను ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పునరావాస కేంద్రానికి తరలించి భోజన వసతి ఏర్పాటు చేశారు. వరద ప్రాంతాలను తహసీల్దార్ సృజన్‌కుమార్, ఎంపీడీవో జవహర్‌రెడ్డి, పస్రా సీఐ రవీందర్, ఎస్సై కమలాకర్ సందర్శిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. అలాగే లక్నవరం సందర్శనను నిలిపివేయాలని కలెక్టర్ దివాకర టూ రిజం అధికారులను ఆదేశించారు. రామప్ప చెరువులోకి భారీగా వరద నీరు వస్తుండంతో నీటిమట్టం 29.6 అడుగులకు చేరుకుంది. లింగాపూర్- జవహర్‌నగర్, వెల్తుర్లపల్లి- నారాయణగిరిపల్లి, పాలంపేట- లక్ష్మీదేవిపేట, లక్ష్మిదేవిపేట - భూర్గుపేట గ్రామాల మధ్యలో ఉన్న లో లెవెల్ వంతెనలపై వరద ప్రవాహంతో రాకపోకలకు అంతరాయమేర్పడింది. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రహదారుల వెంట చెట్లు కూలిపోవడంతో ఎస్సై జక్కుల సతీశ్ తొలగింపజేశారు. ఛత్తీస్‌గఢ్‌తో పాటు మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బొగత జలపాతానికి ఆదివారం పెద్ద ఎత్తున్న నీరు చేరి ఉప్పొంగి జాలువారుతున్నది. రక్షణ చర్యల్లో భాగంగా జలపాతం సందర్శనను అటవీశాఖ అధికారులు నిలిపివేశారు. దీంతో పర్యాటకులు గుమ్మడిదొడ్డి గ్రామ శివారు చీకుపల్లి వాగు పక్కన నుంచి ఉన్న కాలినడక జలపాతం వీక్షించేందుకు వెళుతున్నారు. ఈ మార్గం ప్రమాదకరంగా ఉండడంతో అనుకోకుండా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగక ముందే అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. వెంకటాపురం (నూగూరు) మండలం కలిపాక, ముత్తారం, పెంకువాగు, కర్రవాని గుంపు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జిన్నెల వాగు, కంకవాగు, రాచపల్లి వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలకేంద్రంలోని సెర్ప్ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారి పక్కన ఉన్న విద్యుత్ పోల్ విరిగి రోడ్డుపై కి వేలాడుతున్నది. గణపురం మండలం అప్పయ్యపల్లి, వెలుతుర్లపల్లి గ్రామాల మధ్య మోరంచ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాగవతలి గ్రామాల ప్రజల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. బుద్ధారం శివారు వంగపెల్లివాని చెరువు, బాగిర్దిపేట చెరువులు అలుగు పడుతున్నది. గణప సముద్రానికి నీటి వరద ఉధృతి అధికంగా ఉండడంతో పూర్తి స్థాయి నీటి మట్టానికి 30 ఫీట్లకు గాను ఆదివారం 26 ఫీట్లకు చేరుకుంది. మరో రెండు రోజులు ఇలానే ఉంటే మత్తడి పడే అకాశం ఉంది. కాటారం మండలం శంకరంపల్లి, గుండ్రాత్‌పల్లి, పలుచోట్ల పంట పొలాలు నీట మునిగాయి. ఒడిపిలవంచ-గూడూర్ మధ్యలో బండల వాగు, మల్లారం అలుగువాగు భారీ వర్షానికి పొంగి పొర్లడంతో కొన్ని గంటల పాటు పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చింతకాని, కాటారంతో పాటు పలు చెరువులు నిండుకుండళ్ల మారి మత్తడి దూకుతున్నాయి. వర్షంతో పత్తి చేళ్లలోకి నీరు వచ్చి చేరడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గారెపల్లిలో వర్షంతో 33కేవీ విద్యుత్ లైన్ తెగి 11కేవీ విద్యుత్ తీగలపై పడడంతో పాటు పలు చోట్ల వివిధ సమస్యలతో విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చిట్యాల మండలం గిద్దముత్తారం గ్రామ శివారు లో లెవెల్ వంతెన ఉధృతంగా ప్రవహిస్తుండగా టేకుమట్ల మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తు లు వరద ఉధృతికి ద్విచక్ర వాహనం నుంచి జారిపడి కొట్టుకు పోతుండగా స్థానికులు వారిని కాపాడారు. దీంతో లో లెవెల్ వంతెన మీదుగా రాకపోకలు నిలిపి వేసినట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు. నవాబుపేట చలివాగు, నైన్ పాక శివారులో మోరంచవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అందుకుతండాకు చెందిన సల్వల రవికి చెందిన పూరి గుడిసె కూలిపోయింది. నైన్‌పాక, మొరంచపల్లి గ్రామాల్లో భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, చిట్యాల సీఐ మల్లేశ్‌యాదవ్‌తో కలిసి ఏఎస్పీ బోనాల కిషన్ మోరంచవాగును సందర్శించారు.

గుండ్ల వాగును సందర్శించిన మంత్రి సీతక్క

భారీ వర్షాలతో జాతీయ రహదారిపై రాకపోకలు నిలిచిపోయిన దృష్ట్యా ఆదివారం సాయంత్రం మంత్రి సీతక్క గుండ్లవాగు బ్రిడ్జిని పరిశీలించారు. బ్రిడ్జి వద్ద రోడ్డు కోతకు గురి కాకుండా పూడ్చాలని ఆదేశించారు. ఆదివారం సాయంత్రం పస్రా, మేడారం, పస్రా-మంగపేట జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. చిన్న వాహనాలను మాత్రమే పోలీసులు అనుమతించారు.

తాడ్వాయి : కొండపర్తిలో ధ్వంసమైన ఇంటిని పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

ములుగు జిల్లాలో 11.3 సెంటీ మీటర్ల వర్షపాతం

ములుగురూరల్, సెప్టెంబర్ 1 : ములుగు జిల్లాలో శనివారం సాయంత్రం నుంచి ఆదివారం రాత్రి వరకు 11.3 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. వెంకటాపూర్ మండలంలో 6.6 సెంటీ మీటర్లు, ములుగు 7, మంగపేట 7.3, వాజేడు 5.8, కన్నాయిగూడెం 3.5, వెంకటాపురం(నూగూరు) 6.9, గోవిందరావుపేట 15.1, ఏటూరునాగారం 23.5సెం.మీ వర్షం కురువగా తాడ్వాయి మండలంలో అత్యధికంగా 26సెంటీ మీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు పేర్కొన్నారు.

అంకన్నగూడెం హైలెవల్ వంతెనపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

భూపాలపల్లి జిల్లాలో 2.7 సెంటీ మీటర్లు

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 1 : జిల్లాలో ఆదివారం ఉదయం 8:30 గంటల వరకు 2.7 సెంటీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మహాదేవపూర్ మండలంలో 0.2 సెంటీ మీటర్లు, మహాముత్తారం 1.2, పలిమెల 0.9, కాటారం 0.2, మల్హార్‌రావు 3.3, టేకుమట్ల 5.4, మొగుళ్లపల్లి 4.3, చిట్యాల 4.1, రేగొండ 5.8, గణపురం 2.6, భూపాలపల్లి మండలంలో 2.3 సెంటీ మీటర్లు నమోదైనట్లు వారు వివరించారు.

పునరావాస కేంద్రంలో ఉన్న భూటారం గిరిజనులు

పునరావాస కేంద్రానికి భూటారం గిరిజనులు

ఏటూరునాగారం, సెప్టెంబర్ 1 : మండలంలోని భూటారం గ్రామానికి చెందిన గిరిజనులను ముందస్తుగా గిరిజన భవన్‌లోని పునరవాస కేంద్రానికి అధికారులు తరలించారు. ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఎంపీవో కుమార్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి వరద పరిస్థితిని వివరించి పునరావాస కేంద్రానికి రావాలని సూచించారు. ట్రాక్టర్లు, ఆటోల్లో 232 మందిని తరలించినట్లు కార్యదర్శి తెలిపారు.

వాగులో కొట్టుకుపోయి ఒకరి మృతి

మల్లికార్జున్(ఫైల్)

తాడ్వాయి, సెప్టెంబర్ 1 : వాగులో కొట్టుకుపోయి జెర్రిపోతుల మల్లికార్జున్(38) మృతిచెందిన ఘటన మండలంలోని కాల్వపల్లిలో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. మల్లికార్జున్ ఉదయం వేళలో పశువులను మేతకు తీసుకువెళ్లాడు. తిరిగి ఇంటికి తీసుకువచ్చేందుకు వెంగమాంబ చెరువు మత్తడి కాలువను దాటేందుకు ప్రయత్నించగా వరద ప్రవాహం ఎక్కువగా ఉండటంతో కొట్టుకుపోయాడు. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు కొందరు వాగులోకి దిగి వెతకగా మల్లికార్జున్ మృతదేహం లభించింది. మృతుడికి భార్య భారతి ఉన్నారు.

రామప్ప దేవాలయం మూసివేత

నిరాశతో వెనుదిరిగిన పర్యాటకులు

వెంకటాపూర్, సెప్టెంబర్ 1 : భారీ వర్షాల నేపథ్యంలో రామప్ప దేవాలయాన్ని ఆదివారం పురావస్తుశాఖ అధికారులు మూసివేశారు. భారీ వర్షాలు కురుస్తున్నందున జిల్లాలో పర్యాటక ప్రదేశాలను మూసివేయాలని కలెక్టర్ ఆదేశించగా అధికారులు రామప్ప ఆలయాన్ని మూసివేశారు. ఆలయ సందర్శనను నిలిపివేసి గేట్లకు తాళం వేశారు. సందర్శనకు వచ్చిన పర్యాటకులు గేటుకు తాళం వేసి ఉండటంతో నిరాశతో వెనుదిరిగారు.

వర్షాలతో బస్టాండులో నిలిచిన బస్సులు

ఇబ్బందులకు గురైన ప్రయాణికులు

ఏటూరునాగారం, సెప్టెంబర్ 1 : తాడ్వాయి-పస్రా మధ్యలోని జనగలవంచ వాగు వద్ద జాతీయ రహదారి ప్రమాదకరంగా మారడంతో శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు బస్సుల రాకపోకలను నిలిపివేశారు. దీంతో ఏటూరునాగారం బస్టాండులో గుంటూరు, విశాఖపట్నం, రాజమండ్రి నుంచి హనుమకొండ వైపు వెళ్లాల్సిన బస్సులను ఏటూరునాగారంలోనే నిలిపివేశారు. వీటితో పాటు హైదరాబాద్, హనుమకొండ వెళ్లాల్సిన బస్సులను కూడా బస్టాండులోనే నిలిపివేశారు. దీంతో దూర ప్రాంతాల నుంచి తమ గమ్య స్థానాలకు చేరుకోవాల్సిన ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. చిన్న వాహనాలకు జనగలవంచ వద్ద అనుమతి ఇవ్వడంతో కొందరు ప్రయాణికులు టాటా మ్యాజిక్‌లు, కార్లలో వెళ్లారు. ఇక గుంటూరు, రాజమండ్రి, విశాఖపట్నం లాంటి దూర ప్రాంతాల నుంచి వచ్చిన డ్రైవర్లు, కండక్టర్లు కూడా అసౌకర్యానికి గురయ్యారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఏటూరునాగారం మండలంలో శనివారం కురిసిన భారీ వర్షానికి రాత్రి ఏడు గంటల నుంచి అర్ధరాత్రి వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉరుములు, మెరుపులకు పలు ఇళ్లల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి విద్యుత్ గృహోపకర వస్తువులు కాలిపోయాయి. ఆదివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కూడా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఏఎస్పీ

ఏటూరునాగారం, సెప్టెంబర్ 1 : భారీవర్షాలు కురుస్తున్నందున అనవసర ప్రయాణాలు నివారించుకోవాలని ఏఎస్పీ శివం ఉపాధ్యాయ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. వరదలు సంభవించే అవకాశం ఉన్నందున 48గంటలపాటు భద్రత చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ముఖ్య సలహాలు, సూచనలు ప్రజలు పాటించాలని కోరారు. వరదలకు గురయ్యే ప్రాంతాల్లో ప్రచార సాధనాల ద్వారా వరద హెచ్చరికల అప్‌డేట్ తెలుసుకోవాలన్నారు. వృద్ధులు, పిల్లలు, ప్రత్యేక అవసరాలు కలిగి ఉండే వారికి సహాయం అందించాలని సూచించారు. వరదలు ఉన్నపుడు రోడ్లు, వంతెనలు దాటేందుకు ప్రయత్నాలు చేయొద్దన్నారు. అత్యవసర సాయం కోసం పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గణపురం : గణపసముద్రం నీటిమట్టం సూచిక బోర్డు

కాటారం : మల్లారం వద్ద బ్రిడ్జిపై ఉధృతంగా ప్రవహిస్తున్న అలుగువాగు

చిట్యాల : గిద్దముత్తారం లో లెవెల్ వంతెనపై వరదకు అడుపుతప్పిన ద్విచక్ర వాహనదారుడిని కాపాడుతున్న స్థానికులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లినర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లినర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-318996

BUSINESS OFFER

★చాలా పెద్ద చదువులు చదువుకున్న నిరుద్యోగ యువతీ, యువకులకు సువర్ణావకాశం. అతి తక్కువ పెట్టుబడితో ప్రతి నెల అత్యధికంగా సంపాదించుకునే సువర్ణావకాశం. సంప్ర: సెల్: 9502940056.
NTW-326315

WANTED HOSPITAL STAFF

jobs Apply Now!

★Pharmacy Boys, Operation Theater Boys & Receptionist / సిస్టమ్ ఆపరేటర్స్ కావలెను. సంప్ర: గార్డియన్ హాస్పిటల్, ములుగు 'X' రోడ్, వరంగల్. 12 to 2 PM.
NTW-0418

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

నేడు విద్యా సంస్థలకు సెలవు

ములుగురూరల్/భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 1 : భారీ వర్షాల నేపథ్యంలో విద్యా సంస్థలకు నేడు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్లు టీఎస్ దివాకర, రాహుల్‌శర్మ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. జిల్లాల్లోని అన్ని విద్యా సంస్థలు విధిగా ఆదేశాలను పాటించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవద్దనే ఉద్దేశంతో సోమవారం సెలవు ప్రకటించినట్లు తెలిపారు.

నేటి ప్రజావాణి, గిరిజన దర్బార్ రద్దు

ములుగురూరల్/ఏటూరునాగారం, సెప్టెంబర్ 1 : ములుగు కలెక్టరేట్ సమావేశ మందిరంలో నేడు నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని, ఏటూరునాగారం ఐటీడీఏలో సోమవారం నిర్వహించాల్సిన గిరిజన దర్బార్‌ను రద్దు చేసినట్లు కలెక్టర్ టీఎస్ దివాకర, ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవద్దనే ఉద్దేశంతో ప్రజావాణి, గిరిజన దర్బార్‌ను రద్దు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి దరఖాస్తులను సమర్పించేందుకు రావొద్దని, వచ్చే సోమవారం ఆయా కార్యక్రమాలను కొనసాగిస్తామని వారు వెల్లడించారు.

5న రైతు సంఘం సమావేశం

మాట్లాడుతున్న జంపాల రవీందర్

వెంకటాపూర్, సెప్టెంబర్ 1 : జిల్లా కేంద్రంలో ఈ నెల 5న జరిగే రైతు సంఘం సమావేశాన్ని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలలో రవీందర్ మాట్లడుతూ రైతాంగం సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని అన్నారు. రుణమాఫీలో తలెత్తుతున్న పలు సమస్యలు, అపోహలు, అనుమానాలపై చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి బండి నర్సయ్య, రైతు సంఘం జిల్లా కన్వీనర్ ఎండీ అంజద్‌పాషా, బైకని మల్లయ్య, బొంతల మల్లయ్య, విజేందర్, యాదగిరి, శ్రీనివాస్, లింగయ్య పాల్గొన్నారు.

జూట్ బ్యాగుల తయారీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఏటూరునాగారం, సెప్టెంబర్ 1 : ఎస్సీఐ ఆర్సీటి సహకారంతో ఈనెల 18నుంచి 30వ తేదీ వరకు జూట్ బ్యాగుల తయారీలో మహిళలకు శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ బాస రవికుమార్, సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈనెల 2వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. 13రోజులపాటు అందించే ఈ శిక్షణలో ఉచిత భోజనం, వసతి ఉంటుందని తెలిపారు. వివరాలకు 9441304 661 నంబర్‌ను సంప్రదించాలని వారు తెలిపారు.

గుండ్ల వాగు బ్రిడ్జికి పొంచి ఉన్న ప్రమాదం

ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

పస్రా సమీపంలో కోతకు గురవుతున్న గుండ్లవాగు బ్రిడ్జి

గోవిందరావుపేట, సెప్టెంబర్ 1 : మండలంలోని పస్రా సమీపంలోని గుండ్లవాగు బ్రిడ్జి వద్ద మరో సారి కోతకు గురవుతూ ప్రమాదం పొంచి ఉంది. గుండ్లవాగు ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండుకొని మత్తడి పోస్తుండటంతో ఆ నీటితోపాటు మూడు రోజులుగా వర్షం కురుస్తుండడంతో గుండ్లవాగు బ్రిడ్జి వద్ద వరద ఉధృతి ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో బ్రిడ్జి చివరి భాగాన మళ్లీ కోతకు గురయ్యే అవకాశం ఉంది. గత సంవత్సరం జూన్‌లో బ్రిడ్జికి ఇరువైపులా కోతకు గురి కాగా అధికారులు తాత్కాళిక మరమ్మత్తులు చేశారు. అప్పటి ఎమ్మెల్యే సీతక్క బ్రిడ్జికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ఎన్‌హెచ్ అధికారులకు ఆదేశించినప్పటికీ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టిలేదు. ప్రస్తుతం మళ్లీ గండి పడటానికి సిద్ధంగా ఉంది. దీంతో గత మూడు రోజుల నుంచి భారీ వాహనాలతోపాటు ఆర్టీసీ బస్సులను వంతెన మీదుగా వెళ్లనివ్వకుండా చిన్న వాహనాలు వెళ్లే విధంగా పోలీసులు అనుమతిస్తున్నారు. కాగా, ఆదివారం సాయంత్రం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమశాఖల మంత్రి సీతక్క సందర్శించి మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

ములుగురూరల్, సెప్టెంబర్ 1 : రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జిల్లాల వారీగా అధికారులు, ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఆదివారం ఖమ్మం నుంచి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, హైదరాబాద్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ములుగు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ డాక్టర్ పీ శబరీష్ పాల్గొన్నారు. వర్షాల దృష్ట్యా 48గంటలపాటు పీఆర్, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీవోలు అప్రమత్తంగా ఉండాలని పలు, సూచనలు చేశారు. వీసీలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నంబర్ 180042 57109, ఐటీడీఏ ఏటూరునాగారంలోని కంట్రోల్ రూమ్ 6309842395, 08717-293246ను ఏర్పాటు చేశామని తెలిపారు. పర్యాటక ప్రాంతాలైన బొగత జలపాతం, లక్నవరం, రామప్ప సరస్సులతో పాటు ఇతర పర్యాటక ప్రాంతాల సందర్శనను మూసివేశామని తెలిపారు. వీసీలో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, సంబంధిత అధికారులు ఉన్నారు.